## క్లుప్తంగా

### ఆలయానికి విరాళం



విరాళం అందిస్తున్న వొడ్నాల యగ్నేశ్

గంగాధర: మండల కేంద్రంలో శివాలయం నిర్మాణానికి చొప్పదండి యువజన కాంగ్రెస్ కన్వీనర్ వొడ్నాల యగ్నేశ్ మంగళవారం లక్ష రూపాయలు విరాళంగా ఆలయ చైర్మన్ వైద భూపతికి అందజేశారు. ఆలయ నిర్మాణానికి ఆర్థికంగా అండగా నిలిచిన యగ్నేశ్‌కు భూపతి కృతజ్ఞతలు తెలిపారు.

### సౌత్ జోన్ టోర్నమెంట్‌కు వీఎస్‌ఆర్ విద్యార్థులు



విద్యార్థులను అభినందిస్తున్న విజయ్

హుజూరాబాద్‌రూరల్: మండలంలోని సింగాపూర్ గ్రామం వీఎస్‌ఆర్ డిగ్రీ కళాశాల విద్యార్థులు జి.రాహుల్, టి.నిఖిల్, జి.వేణు సౌత్ జోన్ పోటీలకు ఎంపికయ్యారని కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ వి.హనుమకుమార్, కళాశాల ఫిజికల్ డైరెక్టర్ సిద్దమల్ల విజయ్ మంగళవారం తెలిపారు. 9న ఏపీలోని తూర్పు గోదావరి జిల్లా కాకినాడలో జరగబోయే సౌత్ జోన్ యూనివర్సిటీ స్థాయి కబడ్డీ టోర్నమెంట్ పోటీల్లో పాల్గొనడానికి శాతవాహన యూనివర్సిటీ తరఫున ఎంపికయ్యారని, విద్యార్థుల ఎంపిక పట్ల కళాశాల యాజమాన్యం హర్షం వ్యక్తం చేసింది.

### మృతుడి కుటుంబానికి సాయం



బియ్యం అందజేస్తున్న ప్రభాకర్

జమ్మికుంట: పట్టణంలోని అంబేడ్కర్ కాలనీకి చెందిన చర్మకారుడు మడిపల్లి కొంరయ్య ఇటీవల మృతి చెందాడు. టీజీపీఏ రాష్ట్ర అధ్యక్షుడు అంబాల ప్రభాకర్ మంగళవారం మృతుడి కుటుంబానికి యాభై కిలోల బియ్యం అందజేశారు. అనంతరం మాట్లాడుతూ..పేద కుటుంబాలను ఆదుకునేందుకు స్వచ్ఛంద సంస్థలు ముందుకురావాలని కోరారు. కార్యక్రమంలో మల్లయ్య, అనిల్, రమేశ్, ప్రతాప్, ప్రశాంత్, సుదర్శన్, అశోక్, నవీన్, సాంబయ్య తదితరులు పాల్గొన్నారు.

### 14 ఏళ్లలోపు పిల్లలతో పనులు చేయించొద్దు



అవగాహన కల్పిస్తున్న రమేశ్

చిగురుమామిడి: మండలంలోని బొమ్మనపల్లి జెడ్పీ ఉన్నత పాఠశాల ఆవరణలో బాలకార్మిక వ్యవస్థ నిర్మూలనపై మంగళవారం అవగాహన కల్పించారు. బీసీఐ ప్రాజెక్టు ఆధ్వర్యంలో 14 ఏళ్లలోపు పిల్లలతో పనులు చేయించొద్దని, లేదంటే చట్టరీత్యా చర్యలు తీసుకోవాల్సి ఉంటుందన్నారు. అలాగే 18 ఏళ్ల లోపువారితో ప్రమాదకర పనులు చేయించవద్దన్నారు. ఈ కార్యక్రమంలో నవక్రాంతి సమన్వయకర్త రమేశ్, జితేందర్‌రెడ్డి, హెచ్‌ఎం లక్ష్మణ్‌రావు, టీచర్లు రాజమౌళి, ప్రతిమ, శంకరమ్మ, శంకర్, జ్యోత్స్న, శామయ్య, తదితరులు పాల్గొన్నారు.

### కృత్రిమకాలు ఏర్పాటు

చొప్పదండి: మండల కేంద్రానికి చెందిన నిరుపేద చేనేత కార్మికురాలు సామల లక్ష్మీ ప్రమాదవశాత్తు కాలును కోల్పోయారు. ఆలయ ఫౌండేషన్ ఆధ్వర్యంలో జైపూర్ కృత్రిమ కాలును అమర్చారు. ఐఏఎస్ పరికిపండ్ల నరహరి చొరవతో హైదరాబాద్‌లోని మహవీర్ ట్రస్టు సౌజన్యంతో ఫౌండేషన్ కో ఆర్డినేటర్ గాదె గుణసాగర్ కాలును సమకూర్చారు.

### రాష్ట్రస్థాయి క్రీడా పోటీలకు 'మోడల్' విద్యార్థులు

కొత్తపల్లి: మహబూబ్‌నగర్‌లో జరగబోయే రాష్ట్రస్థాయి హ్యాండ్‌బాల్, బాస్కెట్‌బాల్ పోటీల అండర్–19 విభాగంలో కొత్తపల్లి మండలం ఎలగందులలోని మోడల్ స్కూల్ విద్యార్థులు ఎంపికైనట్లు ఆ స్కూల్ ప్రిన్సిపాల్ వి.సరిత తెలిపారు. హ్యాండ్‌బాల్ పోటీలకు ఎం.మమూరి, బాస్కెట్‌బాల్ పోటీలకు పి.కీర్తన, కె.శివకుమార్‌లు ఎంపిక కావడాన్ని హర్షిస్తూ మంగళవారం వారిని అభినందించారు. విద్యార్థుల ఎంపిక పట్ల ఎస్‌ఎంసీ చైర్మన్ సుధాకర్, పీడీ ఎర్రం హరీశ్, ఉపాధ్యాయులు, విద్యార్థులు హర్షం వ్యక్తం చేశారు.

# ఉన్నా లేనట్టే..!

- ఎన్నికల వేళ పనిచేయని నిఘా నేత్రాలు
- నిర్వహణ లేక నిష్ఫలం
- మండల వ్యాప్తంగా 120 ఏర్పాటు
- సీసీ కెమెరాల ఆవశ్యకతపై అవగాహన కల్పించిన పోలీసులు
- నెరవేరని 'నేనుసైతం'లక్ష్యం



చెట్టుకొమ్మల మధ్యలో సీసీ కెమెరా



సైదాపూర్ చౌరస్తాలో ఏర్పాటు చేసిన సీసీ కెమెరా

సైదాపూర్: శాంతిభద్రతల పరిరక్షణలో భాగంగా ప్రజల భాగస్వామ్యంతో మండల వ్యాప్తంగా 120 సీసీ కెమెరాలు ఏర్పాటు చేశారు. అప్పటి కరీంనగర్ సీపీ కమలాసన్‌రెడ్డి ఆదేశాల మేరకు ‘నేను సైతం’ కార్యక్రమం ద్వారా పోలీసులు, సర్పంచుల అధ్యక్షతన గ్రామ సభలు నిర్వహించారు. సీసీ కెమెరాల ఆవశ్యకతపై ప్రజలకు అవగాహన కల్పించారు. ఆధునిక టెక్నాలజీని వినియోగించుకుంటూ.. నేరాల నియంత్రణ, అసాంఘిక కార్యకలాపాలు, నేరస్తులను సులువుగా, తొందరగా కనిపెట్టేందుకు సీసీ కెమెరాలు ఉపయోగపడతాయని పోలీసులు గ్రామసభల్లో వివరించారు. ప్రజల్లో చైతన్యం తీసుకువచ్చి ఎవరి గ్రామంలో వారే విరాళాలు సేకరించుకొని సీసీ కెమెరాల ఏర్పాటు చేసుకునేలా చేశారు. అన్ని గ్రామాల్లో ఏర్పాటు చేశాకా కొన్ని రోజులు నిఘా నీడలో పల్లెలు ప్రశాంతంగా ఉన్నాయి. కానీ నిర్వహణ లోపంతో రూ.లక్షలు వెచ్చించి ఏర్పాటు చేసిన సీసీ కెమెరాలు పని చేయకపోవడంతో గ్రామాల్లో విరాళాలు ఇచ్చిన నాయకులు, వ్యాపారులు విస్మయం వ్యక్తం చేస్తున్నారు.

**లక్ష్యం చేరుకోని 'నేను సైతం'**

'నేను సైతం'కార్యక్రమంలో మొదట మండల కేంద్రంలో సీసీ కెమెరాల ఏర్పాటుకు మండలంలోని అన్ని గ్రామాల ప్రజాప్రతినిధులు, రాజకీయ నాయకులతో అప్పటి సీఐ గౌస్‌బాబా, ఎస్సై నూతి శ్రీధర్ సమావేశమై సీసీ కెమెరాల ఆవశ్యకతను వివరించారు. స్వచ్ఛందంగా, ప్రజల భాగస్వామ్యంతో ఆర్థిక వనరుల కోసం విశ్రాంత ఉద్యోగులతో కమిటీ వేశారు. మండల కేంద్రం వెన్కెపల్లి–సైదాపూర్ జంట గ్రామాల్లో తొలుత పది కెమెరాలు ఏర్పాటు చేసి పోలీస్ స్టేషన్‌లో సీసీ ఫుటేజీలు పరిశీలించారు. వీటి ఆధారంగా చిన్నచిన్న కేసులు త్వరగా పరిష్కారమయ్యాయి. మండలంలోని 26 గ్రామ పంచాయతీల్లో గ్రామస్తుల సహకారంతో సీసీ కెమెరాలు ఏర్పాటు చేశారు. రెండేండ్లు నిర్వహణ సక్రమంగా కొనసాగినా.. తర్వాత వర్షాలు, కోతుల వల్ల ఒక్క కెమెరా పని చేయడంలేదని, కెమెరాల నిర్వహణ బాధ్యతలు ఎవరు చూడడంలేదని ప్రజలు ఆరోపిస్తున్నారు. నిర్వహణ జీపీలు, పోలీస్‌లు గానీ చేపట్టాలని, వెంటనే మరమ్మతు చేయించాలని కోరుతున్నారు.

### మరమ్మతు చేయించాలి



సీసీ కెరాలు పెట్టినప్పటి నుంచి జనంలో కొంత మార్పు వచ్చింది. కెమెరా ఉంటే పోలీస్ ఉన్నాడనే భావన కలిగింది. మద్యం సేవించినా, అసభ్యంగా మాట్లాడినా కెమెరాల్లో రికార్డు అవుతుందన్న భయం ఉండేది. సీసీ కెమెరాల ఏర్పాటుతో కొన్ని రోజులు నేరాలు తగ్గాయి. సీసీ కెమెరాతో పోలీసులకు చిక్కుతామని నేరప్రవృత్తి కలిగినవారు సైతం మారారు. కానీ అవి పని చేయడంలేదని తెలిశాక నేరాలు మొదలయ్యాయి. గుప్త నిధుల తవ్వకాలతో పాటు అనేక రకాల నేరాలు జరుగుతున్నాయి. మరమ్మతు చేయించి, నిర్వహణలోపం లేకుండా చూడాలి.

– బిల్లం గణేశ్, వార్డుసభ్యుడు, ఘనపూర్

### నిర్వహణ లోపం లేకుండా చూస్తాం



దొంగతనాలు, అసాంఘిక కార్యకలాపాలు అరికట్టేందుకు, నేరస్తులను కనిపెట్టేందుకు మండల కేంద్రంతో పాటు అన్ని గ్రామాల్లో ప్రజల భాగస్వామ్యంతో సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకునేలా చైతన్యం కలిగించాం. మండల వ్యాప్తంగా వందకుపైగా సీసీ కెమెరాలు ఉన్నాయి. వ్యాపారస్తులు, ఆర్థిక స్థోమత కలిగినవారు గృహల వద్ద ఏర్పాటు చేసుకుంటే రక్షణగా ఉంటుందని అవగాహన కల్పించాం. నిర్వహణ లోపం లేకుండా చూస్తాం. కానీ వర్షాలు, కోతుల వల్ల సీసీ కెమెరాలు పని చేయడంలేదు. సోలార్ సిస్టంతో మొదటి విడతగా దుద్దెనపల్లి, ఎగ్లాస్‌పూర్, సోమారం, వెన్నంపల్లి, లస్మన్నపల్లి, ఆరెపల్లి గ్రామాల్లో సీసీ కెమెరాలు ఏర్పాటు చేయిస్తున్నాం.

– జన్ను ఆరోగ్యం, ఎస్సై, సైదాపూర్

### అనుచిత వ్యాఖ్యలు చేశారని ఫిర్యాదు



ఫిర్యాదు చేస్తున్న మైనారిటీ నాయకులు

జమ్మికుంట: ప్రజా సంఘాల జేఏసీ అధ్యక్షుడు గజ్జెల కాంతం, మంత్రి గంగుల కమలాకర్ మైనారిటీలపై అనుచిత వ్యాఖ్యలు చేశారని తెలంగాణ బీసీ సంక్షేమ సమితి మైనారిటీ విభాగం రాష్ట్ర కార్యదర్శి షేక్ సాబీర్ అలీ, మైనారిటీల ఫోరం సభ్యులు మొహమ్మద్ గయాస్‌ఖాన్ జమ్మికుంట పట్టణ పోలీస్ స్టేషన్‌లో మంగళవారం ఫిర్యాదు చేశారు. కరీంనగర్ అంబేడ్కర్ స్టేడియంలో తెలంగాణ ప్రజా సంఘాల జేఏసీ ఆధ్వర్యంలో నిర్వహించిన ప్రజా ఆశీర్వాద సభకు మంత్రి కమలాకర్‌ను ఆహ్వానించడానికి వెళ్లే క్రమంలో మైనార్టీలను వెంట ఏసుకొని ఎందుకు తిరుగుతున్నావు అని మంత్రి తనతో అన్నారని గజ్జెల కాంతం బహిరంగ సభలో చెప్పారని, వీడియో ఆధారాలతో పోలీస్ స్టేషన్ లో ఫిర్యాదు చేశామని తెలిపారు. ఫిర్యాదు చేసినవారిలో తెలంగాణ బీసీ సంక్షేమ సమితి హుజూరాబాద్ డివిజన్ ఉపాధ్యక్షుడు మహమ్మద్ యాకూబ్, న్యాయవాది కొత్తూరి రమేశ్ ఉన్నారు.

### మదర్సాల సందర్శన

కరీంనగర్: నగరంలోని ఖాన్‌పురా, నవరన్‌స్ట్రీట్, అంబేద్కర్‌నగర్, కార్ఖానగడ్డ, గోదాంగడ్డ, కశ్మీర్ గడ్డ, ఎల్‌ఎండీ కాలనీ, రామకృష్ణకాలనీలలోని మదర్సాలను మంగళవారం డీసీపీవో శాంత, చైల్డ్ హెల్ప్‌లైన్ 1098 జిల్లా కోఆర్డినేటర్ సంపత్ సందర్శించారు. అందులో చదువుకునే పిల్లల గురించి అడిగి తెలుసుకున్నారు. వారికి అందించే విద్యపై వివరాలు సేకరించారు. మదర్సాల యజమానులు, చైల్డ్ హెల్ప్‌లైన్ 1098 టీం నరేంద్ర, సాయికిరణ్, మహేశ్, ప్రియాంక, ప్రిన్సిపాల్స్ పాల్గొన్నారు.

## విశ్వరూప మహాసభ కరపత్రాల పంపిణీ



రామడుగు: వెదిరలో కరపత్రాలు అందిస్తున్న ఎమ్మార్పీఎస్ నాయకులు

రామడుగు: ఎమ్మార్పీఎస్ ఆధ్వర్యంలో హైదరాబాద్‌లో నిర్వహించే మాదిగల విశ్వరూప మహాసభ కరపత్రాలను ఎమ్మార్పీఎస్ నాయకులు మంగళవారం మండలంలోని వెదిర గ్రామంలో పంపిణీ చేశారు. మాదిగలు భారీగా తరలిరావాలని ఎమ్మార్పీఎస్ చొప్పదండి నియోజకవర్గ ఇన్‌చార్జి తడగొండ శంకర్ కోరారు. కార్యక్రమంలో నాయకులు కొత్తూరి రాజయ్య, శనిగరపు హన్మయ్య, గుడిసే విజయ్, రాము, పలువురు పాల్గొన్నారు.

**మహాసభను విజయవంతం చేయాలి**

హుజూరాబాద్‌రూరల్: హైదరాబాద్‌లోని పరేడ్ గ్రౌండ్‌లో 11న నిర్వహించే మాదిగల విశ్వరూప మహాసభను విజయవంతం చేయాలని ఎమ్మార్పీఎస్, ఎంఎస్పీ నాయకులు కోరారు. మంగళవారం రంగాపూర్, తోకలపల్లి, చెల్పూర్, ఇందిరానగర గ్రామాల్లోని దళిత కాలనీల్లో పర్యటించారు. మహాసభకు సంబంధించిన కరపత్రాలను పంపిణీ చేస్తూ సభకు అధిక సంఖ్యలో తరలిరావాలని కోరారు. కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ కరీంనగర్ జిల్లా కన్వీనర్ రుద్రారపు రామచంద్రం, సీనియర్ నాయకులు మారెపల్లి శ్రీనివాస్, డాక్టర్ తడికమళ్ల శేఖర్, నియోజకవర్గ ఇన్‌చార్జి తునికి వసంత్, హుజూరాబాద్ మండల కన్వీనర్ దేవునూరి రవీందర్, వివిధ గ్రామాల కమిటీ సభ్యులు పాల్గొన్నారు.



హుజూరాబాద్‌రూరల్: తోకలపల్లిలో ప్రచారం చేస్తున్న నాయకులు

## ముగిసిన క్రికెట్ టోర్నమెంట్



కొత్త శ్రీనివాస్‌రెడ్డిని సన్మానిస్తున్న క్రీడాకారులు

చిగురుమామిడి: మండల కేంద్రంలో నెల రోజులుగా నిర్వహించిన సీపీఎల్ క్రికెట్ టోర్నమెంట్ మంగళవారంతో ముగిసింది. గెలుపొందిన జట్లకు బహుమతులు అందజేశారు. టోర్నమెంట్‌లో హుస్నాబాద్ నియోజకవర్గంలోని దాదాపు 80 జట్లు పాల్గొన్నాయి. విన్నర్ హుస్నాబాద్ జట్టుకు కప్‌తో పాటు రూ.20 వేల నగదు, రన్నర్ సైదా పూర్ మండలం శివరాంపల్లి జట్టుకు కప్‌తో పాటు రూ.పదివేల నగదు అందించారు. అనంతరం నిర్వాహకులు కొత్త శ్రీనివాస్‌రెడ్డిని శాలువా కప్పి సన్మానించారు. కార్యక్రమంలో జర్నలిస్టు రఘునాథరెడ్డి, రాజిరెడ్డి, రాజేశ్వర్‌రెడ్డి, క్రీడాకారులు పాల్గొన్నారు.

## అక్రమ నిర్మాణం కూల్చివేత

కరీంనగర్‌రూరల్: సందట్లో సడేమియాలా భూకబ్జాదారులు ఎన్నికల హడావుడిలో అధికారులుండటంతో ప్రభుత్వ స్థలాన్ని ఆక్రమించి ప్రహరీ నిర్మించారు. కరీంనగర్ మండలం బొమ్మకల్‌లోని ప్రభుత్వస్థలంలో అక్రమంగా నిర్మించిన కట్టడాలను మంగళవారం రెవెన్యూ అధికారులు తొలగించారు. సర్వేనం.28లోని చెరువుశిఖం స్థలంలో ఇద్దరు వ్యక్తులు రెండురోజుల నుంచి అక్రమంగా ప్రహరీ నిర్మిస్తున్నారు. మంగళవారం స్థానికులు అక్రమ నిర్మాణంపై ఆర్డీవో మహేశ్వర్‌కు ఫిర్యాదు చేశారు. ఆర్డీవో ఆదేశాల మేరకు తహసీల్దార్ నవీన్ వెంటనే ఆర్‌ఐ వాస్తవిక్‌ను మోఖాపై పంపించారు. పంచాయతీ కార్యదర్శి హిదైతుల్లాతో కలిసి ఆర్‌ఐ అక్రమంగా నిర్మించిన రెండు ప్రహరీలను జేసీబీతో కూల్చివేయించారు. ప్రభుత్వ,శిఖం భూముల్లో అక్రమ నిర్మాణాలు చేస్తే చట్టప్రకారం తగిన చర్యలు చేపడుతామని తహసీల్దార్ నవీన్ తెలిపారు.



జేసీబీతో ప్రహరీ కూల్చి వేస్తున్న దృశ్యం

### వాహనాల తనిఖీ



వాహనాలు తనిఖీ చేస్తున్న సీఐ రమేశ్

జమ్మికుంట: పట్టణంలోని గాంధీచౌక్ వద్ద టౌన్ సీఐ బార్పటి రమేశ్, కేంద్ర బలగాల ఆధ్వర్యంలో మంగళవారం వాహనాల తనిఖీ నిర్వహించారు. ఎన్నికల నేపథ్యంలో అవాంఛనీయ సంఘటనలు జరగకుండా వాహనాల తనిఖీ చేపడుతున్నామని, డబ్బు వెంట తీసుకు వెళ్లేవారు సరైన పత్రాలను చూపించాలని సూచించారు. ఎన్నికల నిర్వహణకు ప్రజలు సహకరించాలని కోరారు. కార్యక్రమంలో ఏఎస్సై రాధాకృష్ణ, పోలీసులు, బీఎస్‌ఎఫ్ జవాన్లు పాల్గొన్నారు.

### రాష్ట్రస్థాయి ఎన్‌సీఎస్‌సీకు 'సెయింట్‌జార్జ్' ప్రాజెక్టు

కొత్తపల్లి: కొత్తపల్లిలోని సెయింట్‌జార్జ్ ఇంటర్నేషనల్ (సీబీఎస్‌ఈ) స్కూల్ విద్యార్థులు రూపొందించిన 'ఐస్ రిజర్వాయర్' నమూనా రాష్ట్రస్థాయి నేషనల్ సైన్స్ కాంగ్రెస్ పోటీలకు ఎంపికైనట్లు ఆ స్కూల్ చైర్మన్ డా.పోతిరెడ్డి ఫాతిమారెడ్డి తెలిపారు. కరీంనగర్‌లోని ఓ ప్రైవేట్ పాఠశాలలో జరిగిన జిల్లాస్థాయి నేషనల్ చిల్డ్రన్స్ సైన్స్ కాంగ్రెస్ పోటీల్లో జిల్లావ్యాప్తంగా 93 ప్రాజెక్టులు ప్రదర్శించగా అందులో సెయింట్ జార్జ్ విద్యార్థులు హసన్, రామ్‌చరణ్ రూపొందించిన ఐస్ రిజర్వాయర్ రాష్ట్రస్థాయికి ఎంపిక కావడం సంతోషంగా ఉందన్నారు. ఈ సందర్భంగా ఎంపికైన విద్యార్థులను, గైడ్ టీచర్ మల్లికార్జున్, సీఈవో ఉమాకాంత్‌ను మంగళవారం ఆయన అభినందించారు.

### కేవై జ్యోతి సుగుణాకర్ మృతికి సంతాపం

కరీంనగర్ కల్చరల్: మూడు దశాబ్దాల పాటు తెలంగాణ కళారంగానికి సేవలందించిన కరీంనగర్‌కు చెందిన గాయకుడు కేవై జ్యోతి సుగుణాకర్ (62) మృతికి పలువురు కళాకారులు సంతాపం వ్యక్తం చేశారు. ఆయన మృతి కళారంగానికి తీరని లోటని అన్నారు. సంతాపం తెలిపిన వారిలో పెద్దపల్లి జిల్లా అడిషనల్ కలెక్టర్ జీవీ శ్యాంప్రసాద్‌తో పాటు నరసింహగౌడ్, గుండ్ర కృపాదానం, కనకం రమణయ్య, సల్వాజి ప్రవీణ్‌కుమార్, జి.ప్రభుకుమార్, ఎల్.శ్రీనివాస్, ప్రకాశ్ కవిత్కర్, డాక్టర్ గంద్ర లక్ష్మణరావు, గోపాల్, కొత్త అనిల్‌కుమార్, టి.సాల్మన్‌రాజ్, బి సంజయ్, టి.మోహన స్వామి. టి.రవిపాల్, కె.రణధీర్, ఎండీ.ఇస్మాయిల్, ప్రవీణ్‌సాగర్ తదితరులు పాల్గొన్నారు.

## ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ఆశా డే



మాట్లాడుతున్న మెడికల్ ఆఫీసర్ ధర్మనాయక్

చిగురుమామిడి: ప్రభుత్వ ఆసుపత్రుల్లో సుఖప్రసవాల సంఖ్య పెంచే దిశగా ఏఎన్‌ఎంలు, ఆశా వర్కర్లు పనిచేయాలని చిగురుమామిడి మెడికల్ ఆఫీసర్ ధర్మానాయక్ కోరారు. మంగళవారం మండల కేంద్రంలో ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ఆశా డే కార్యక్రమం నిర్వహించారు. ఇంటింటికి వెళ్లి జ్వరపీడితుల వివరాలను నమోదు చేసి మాత్రలు పంపిణీ చేయాలన్నారు. గర్భిణులు, చిన్నారులకు క్రమం తప్పకుండా వ్యాక్సిన్లు వేయాలన్నారు. ఫైలేరియా వ్యాధిగ్రస్తుల కిట్లను ఆశ కార్యకర్తలకు అందించి గ్రామాల్లో పంపిణీ చేయాలన్నారు. కార్యక్రమంలో పల్లె దవాఖాన డాక్టర్ కార్తిక్, సందీప్‌రెడ్డి, సూపర్‌వైజర్ చంద్రకళ, హాజీబాబు, పాల్గొన్నారు.

## వ్యాసరచన పోటీల్లో విద్యార్థుల ప్రతిభ



విద్యార్థులకు బహుమతులు ప్రదానం చేస్తున్న నిర్వాహకులు

తిమ్మాపూర్: టాటా బిల్డింగ్ ఇండియా ఆధ్వర్యంలో మండలంలోని నేదునూర్ ప్రభుత్వ పాఠశాలలో 'వ్యర్థాలను తగ్గించడం, రీసైక్లింగ్‌ను ప్రోత్సహించడానికి అనుసరించే ఐదు అంశాలు' అనే దానిపై మంగళవారం వ్యాసరచన పోటీలు నిర్వహించారు. జూనియర్ విభాగంలో 6, 7వ తరగతి, సీనియర్ విభాగంలో 8, 9, 10వ తరగతి విద్యార్థులు పాల్గొన్నారు. జూనియర్, సీనియర్ విభాగంలో ముగ్గురు చొప్పున బంగారు, వెండి, కాంస్య పతకాలు బహుమతులుగా ప్రకటించారు. జూనియర్ కేటగిరీలో ప్రథమ, ద్వితీయ, తృతీయ బహుమతులు కాల్వ లావణ్య, జి.రామ్‌చరణ్, చాణక్య ఈశ్వర్, సీనియర్ కేటగిరీలో స్వర్ణదేశ్, భూమిక, స్ఫూర్తి పతకాలు సాధించారు. కార్యక్రమంలో టీసీఎస్ రీజినల్ మేనేజర్ లీలాకృష్ణరాజ్ కిరణ్, రజనీకాంత్, మనోజ్, హెచ్‌ఎం చీటి లక్ష్మణ్ రావు, ఉపాధ్యాయులు, తిరుపతిరెడ్డి, జాకీర్‌హుస్సేన్, గనీ, పద్మ, అనీస్ ఫాతిమా, అమల, శ్రీధర్ పాల్గొన్నారు.

## ఎమ్మెల్యేను ప్రశ్నించిన నాయకులు

తిమ్మాపూర్: మండలంలోని నల్లగొండ గ్రామంలో ఎమ్మెల్యే రసమయి బాలకిషన్ మంగళవారం ఎన్నికల ప్రచారం నిర్వహిస్తుండగా కొంతమందికే దళితబంధు, బీసీబంధు అందించారని మిగతా వారికి ఎలాంటి అభివృద్ధి పథకాలు అందలేదని యువత, కాంగ్రెస్ నాయకులు ప్రశ్నించారు. గ్రామంలో ఏం అభివృద్ధి చేశారని నిలదీశారు. ప్రచారం అడ్డుకోవద్దని బీఆర్‌ఎస్ నాయకులు వాగ్వాదానికి దిగారు. అసహనానికి లోనైనా ఎమ్మెల్యే తాగుబోతుల మాటలు పట్టించుకోవద్దని, ఇలాంటి వారు ఊరికి ఇద్దరు, ముగ్గురు ఉంటారని ప్రచారం కొనసాగించారు. ఎన్నికల అధికారులు పోలీసులకు సమాచారం అందించగా ఎస్సై ప్రమోద్‌రెడ్డి ఘటనా స్థలానికి చేరుకొని పరిస్థితిని నియంత్రించి అడ్డుకున్నవారిని పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. పలువురు కాంగ్రెస్ నాయకులకు నోటీసులు అందించారు. అదేవిధంగా సమస్యలపై ప్రశ్నించినందుకు ఎమ్మెల్యే దుర్భాషలాడారని కాంగ్రెస్ నాయకులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఉన్నతాధికారులకు సమాచారం అందించామని ఎస్సై తెలిపారు.

### పోస్టర్ ఆవిష్కరణ

సప్తగిరికాలనీ(కరీంనగర్): ఎస్సీ రిజర్వేషన్ వర్గీకరణ బిల్లుకు చట్టబద్ధత కల్పించాలని డిమాండ్ చేస్తూ ఈనెల 11న హైదరాబాద్‌లో జరిగే మాదిగల విశ్వరూపం మహాసభ వాల్‌పోస్టర్‌ను మంగళవారం కరీంనగర్‌లో జిల్లా ఇన్‌చార్జి బచ్చలకూరి వెంకటేశ్వర్లు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వెంకటేశ్వర్లు మాట్లాడుతూ మాదిగల విశ్వరూపం మహాసభకు ప్రధాని నరేంద్ర మోదీ హాజరుకానున్నారని, పెద్ద సంఖ్యలో హైదరాబాద్‌కు తరలిరావాలని కోరారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు బెజ్జంకి అనిల్, తుంగ ఆంజనేయులు, దండు అంజయ్య, చిలుముల రాజయ్య, తడగొండ శంకర్, కొత్తూరి రాజన్న, గంగాధర పోచయ్య, తదితరులు పాల్గొన్నారు.

### తొందరపడొద్దు.. భవిష్యత్ ఉంటది



మాట్లాడుతున్న వంశీచంద్‌రెడ్డి

కరీంనగర్ కార్పొరేషన్: వచ్చేది కాంగ్రెస్ ప్రభుత్వమేనని, మంచి భవిష్యత్ ఉంటుందని ఏఐసీసీ కార్యదర్శి, ప్రత్యేక దూత వంశీచంద్‌రెడ్డి కాంగ్రెస్ పార్టీ నగర అధ్యక్షుడు కోమటిరెడ్డి నరేందర్‌రెడ్డికి భరోసా ఇచ్చారు. టికెట్ రాకపోవడంతో నరేందర్‌రెడ్డిని బుజ్జగించేందుకు వంశీచంద్ మంగళవారం కరీంనగర్‌కు వచ్చి చర్చలు జరిపారు. పార్టీ కోసం సంవత్సరాలుగా కష్టపడ్డా తనకు టికెట్ నిరాకరించడంపై నరేందర్‌రెడ్డి అసంతృప్తి వ్యక్తం చేశారు. కొన్ని రాజకీయ సమీకరణల కారణంగా టికెట్ శ్రీనివాస్‌కు కేటాయించడం జరిగిందని, రానున్న కాంగ్రెస్ ప్రభుత్వంలో తప్పకుండా సముచిత స్థానం లభిస్తుందని వంశీచంద్ నచ్చజెప్పారు. ఏఐసీసీ పెద్దల ఆదేశంతోనే తాను వచ్చానని, తొందరపడి ఎలాంటి నిర్ణయాలు తీసుకోవద్దని నరేందర్‌కు తెలిపారు.